క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

అమరాపురం: హేమావతిలో వెలసిన సిద్ధేశ్వర స్వామికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఈఓ నరసింహరాజు ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా రూ.3,76,532 ఆదాయం వచ్చిందన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం


ఉద్యోగులను సన్మానించిన గ్రామపెద్దలు

లేపాక్షి: మండలంలోని కోడిపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తు బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ మంజునాథ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శంకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నరసింహప్ప, వేణు తదితరులలు పాల్గొన్నారు.

డివైడర్ తొలగింపు


అనుమతులు లేకుండా డివైడర్‌ను తొలగించిన దృశ్యం

పెనుకొండ రూరల్: పట్టణంలోని ట్యాంక్ సర్కిల్‌లో అనుమతులు లేకుండానే, వ్యాపారస్తులు డివైడర్‌ను తొలగించారు. దర్గా సర్కిల్ నుంచి హిందూపురం వెళ్లే ప్రధాన రహదారికి, రహదారులు, భవనాలశాఖ అధికారులు రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా డివైడర్‌ను ఏర్పాటు చేశారు. అయితే కొందరు మద్యం వ్యాపారస్తులు తమ సౌలభ్యం కోసం డివైడర్‌ను తొలగించిన చిత్రాలు మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జేఈ వెంకటేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా డివైడర్ తొలగింపునకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.

జాతీయస్థాయిలో అధ్యాపకుడి ప్రతిభ


ఏటీ రవి

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన సీనియర్ అధ్యాపకుడు ఏటీ రవి జాతీయస్థాయిలో నిర్వహించిన యూజీసీ – నెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయి నెట్ పరీక్షలో 86% ఉత్తీర్ణత సాధించారు. జాతీయస్థాయి పరీక్షలో రవి ఉత్తమ ప్రతిభ కనబరచడంపై బాలయేసు, బాలాజీ, సప్తగిరి కళాశాలల ప్రిన్సిపాళ్లు బలరామిరెడ్డి, వీరభద్రప్ప, నారాయణరెడ్డి తదితరులు రవిని అభినందించారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండండి


మాట్లాడుతున్న ఎస్‌పీఎఫ్ ఐజీ త్రివిక్రమ వర్మ

హిందూపురం టౌన్: విద్యార్థులకు నిరంతరం చదువుపై ఏకాగ్రత ఉంచాలని, మొబైల్ ఫోన్లకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు హిందూపురం పూర్వ విద్యార్థి, ఎస్‌పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఐజీ సీఎం త్రివిక్రమ వర్మ సూచించారు. మంగళవారం తాను చదువుకున్న పట్టణంలోని చిన్మయ విద్యాలయను కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి సందర్శించారు. పాఠశాల ఆడిటోరియంలో 9, 10 తరగతుల విద్యార్థులతో ఆయన కాసేపు ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లండన్ తెలుగు అసోసియేషన్ వైస్ చైర్మన్ బాలాజీ, డాక్టర్ బాలాజీ, ఆదర్శ్ పాల్గొన్నారు.

ఖగోళ శాస్త్రంపై ఆసక్తి పెంచుకోండి


మాట్లాడుతున్న సైంటిస్ట్ సతీష్‌కుమార్

పావగడ: ఖగోళ శాస్త్రంపై ఆసక్తి పెంచుకుని విద్యార్థులు కూడా విజ్ఞాన వేత్తలుగా ఎదగాలని బ్రెజిల్‌లో స్థిరపడిన సైంటిస్ట్ తాలూకాలోని వీహెచ్ పాళ్య గ్రామానికి చెందిన డా నతీష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. తాలూకాలోని అరసికెరెలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాస్త్రవేత్తలు ఏ విధంగా పరిశోధనలు చేస్తారు, పరిశోధన చేయాలంటే ఏమి చేయాలి అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పస్తుల బతుకులు !

- 8 నెలలు గడిచినా అందని జీతాలు
- పూటగడవక ఇబ్బందులు పడుతున్న గొల్లపల్లి వాటర్ వర్క్స్ కార్మికులు
- ఆగస్టు 1 నుంచి సమ్మెలోకి వెళ్తామని కార్మికుల నోటీసు

హిందూపురం టౌన్: చాలీచాలని జీతాలతో బతుకు ఛత్రాన్ని నెట్టుకొస్తున్న జీవితాలు వారివి. అయితే వారికిచ్చే అరకొర జీతం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 8 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో గొల్లపల్లి వాటర్ వర్కర్స్ కార్మికులు రోడ్డున పడ్డారు. ఇటు జీతం రాక, అటూ బయట కొత్త అప్పులు పుట్టక, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక సతమతమవుతూ దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. హిందూపురం పట్టణానికి గొల్లపల్లి నుంచి నీరు రావాలంటే గొల్లపల్లి పంప్ హౌస్ నుంచి విడుదలై కొట్నూరు పంప్ హౌస్‌కు చేరాలి. అక్కడి నుంచి పట్టణానికి నీటిని విడుదల చేస్తారు. గొల్లపల్లి పంప్ హౌస్‌లో అలాగే శ్రీకృష్ణదేవరాయ నగర్ పంప్ హౌస్, వెంకటాపురం తండా పంప్ హౌస్, కొట్నూరు పంప్ హౌస్‌లో మొత్తం 25 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి గత 8 నెలలు గడిచినా జీతాలు అందలేదు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జీతాలు అందడం లేదని మున్సిపల్ కమిషనర్ నుంచి కలెక్టర్ వరకూ విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆగస్టు 1వ తేదీ నుంచి హిందూపురానికి నీళ్లు బంద్ చేసి సమ్మె చేస్తున్నట్లు కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. కార్మికులకు నీటిని బంద్ చేసి సమ్మెలోకి దిగితే పట్టణంలో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడక తప్పదు.


మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న గొల్లపల్లి వాటర్ వర్క్స్ కార్మికులు (ఫైల్)

ఇబ్బందులు పడుతున్నాం



నేను కొట్నూర్ పంప్ హౌస్ వద్ద పనిచేస్తున్నాను. నాకు ప్రతి నెలా జీతం రాకపోవడంతో అప్పులు చేసుకొని బతుకుతున్నాము. చాలా దుర్భర జీవితాన్ని గడుపుతున్నాను. కనీసం డ్యూటీకి పోయి రావడానికి పెట్రోల్‌కి కూడా డబ్బులు ఉండటం లేదు. మాకు పెండింగ్‌లో ఉన్న 8 నెలల జీతాన్ని ప్రభుత్వం వెంటనే ఇప్పించాలి.

– తబ్బుల్, కొట్నూరు పంప్ హౌస్ కార్మికుడు

మా బాధలు పట్టవా?



మాకు జీతాలు అందక 8 నెలలు అయింది. ఇప్పుడు 9వ నెల అయినప్పటికీ విధులకు ఆటంకం కలగకుండా పనిచేస్తున్నాం. డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. అప్పులు చేసి జీవితాన్ని నెట్టుకొస్తున్నాము. చిన్న చిన్న అవసరాలకు కూడా డబ్బులు లేవు. జీతాలు చెల్లించాలని పలుసార్లు మున్సిపల్ అధికారులకు వివరించాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. 1 నుంచి సమ్మె చేపడుతున్నట్లు నోటీసులు అందించాం.

– రమేష్, గొల్లపల్లి వాటర్ వర్క్స్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు

నీళ్లు బంద్ చేసి సమ్మెలోకి..



గత ఎనిమిది నెలల నుంచి గొల్లపల్లి వాటర్ వర్కర్స్‌కు జీతాలు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ఆగస్టు 1 నుంచి హిందూపురానికి నీళ్లు బంద్ చేసి సమ్మెలోకి వెళ్లడానికి గొల్లపల్లి వాటర్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ తీర్మానం చేశాం. పలుసార్లు అధికారులకు వినతి పత్రాలు అందించాం, నిరసనలు తెలియజేశాం. స్పందన లేకపోవడంతోనే కార్మికులు సమ్మెకు పూనుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

– వినోద్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వేణురెడ్డి


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన వేణురెడ్డి తదితరులు

చిలమత్తూరు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో హిందూపురం వైఎస్సార్ సీపీ నేత వేణురెడ్డి మంగళవారం కలిశారు. రాయలసీమ జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియమించిన నేపథ్యంలో ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నేత అమరనాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌కుమార్, రంగారెడ్డి, సుధీర్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ ప్రణయ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాలకు ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

లైంగికంగా వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి


దీపిక, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త


చౌళూరు మధుమతిరెడ్డి

చిలమత్తూరు: ప్రభుత్వాస్పత్రిలో శానిటేషన్ మహిళా వర్కర్‌ను లైంగిక వాంఛ తీరిస్తే ఉద్యోగం తిరిగి ఇప్పిస్తానని చెప్పిన టీడీపీ కార్యకర్త, శానిటేషన్ పనులు చేయించే టీడీపీ పట్టణ నాయకుడు యుగంధర్ (చింటు)లపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక డిమాండ్ చేశారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి వ్యక్తులను సమాజం నుంచి వెలివేయాలన్నారు. మహిళలంటే టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు చులకన భావం అని మరోసారి నిరూపితమైందన్నారు. ఇలాంటి వాళ్లను ప్రోత్సహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణకు కూడా మహిళలంటే గౌరవం లేదన్నారు. మహిళలపై టీడీపీ నేతలు చేస్తున్న ప్రలోభాలు, అసభ్య ప్రవర్తలను చూసీ కూడా ఎమ్మెల్యే బాలకృష్ణ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి వాళ్లను వదలకూడదని, పోలీసులు కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మహిళను వేధించిన టీడీపీ కార్యకర్త కగ్గల్లప్పతో పాటు ఆయనతో మహిళకు ఫోన్ చేయించిన టీడీపీ నాయకుడు యుగంధర్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. అన్ని కార్యాలయాల్లో టీడీపీ నేతలు పాగా వేశారని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని మహిళలను వేధిస్తున్నారని మండిపడ్డారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కవితారెడ్డి హెచ్చరించారు.

కార్మికుల అభిప్రాయాలు పట్టవా..


హిందూపురంలో వంటా వార్పు చేసి రోడ్డుపై భోజనం చేస్తున్న కార్మికులు

హిందూపురం టౌన్: మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తుంటే సమ్మె చేస్తున్న కార్మిక సంఘాల నాయకులతో ప్రభుత్వం కనీసం చర్చించకుండా, కార్మికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నా సంఘాలతో చర్చించి వేతనాలను పెంచడం సరికాదని సీఐటీయూ అన్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 7వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు వంటా వార్పు చేసి, మున్సిపల్ కార్యాలయం ఎదుట రహదారిలో భోజనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆగస్టు 5,6,7 తేదీలలో విజయవాడ కేంద్రంలో నిరవధిక దీక్షలు చేపడతామన్నారు.

పెనుకొండ: సమ్మెలో భాగంగా పట్టణంలోని నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ పెంచిన జీతాలు సంతృప్తికరంగా లేవని, కనీసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం


జ్యోతులను తీసుకెళ్తున్న మహిళలు

అగళి: మండల పరిధిలోని ఆలూడిలో వెలసిన కారియమ్మదేవికి మంగళవారం భక్తులు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన చెలిమిడిని జ్యోతులుగా చేసుకొని గ్రామం నుంచి ఊరేగింపుగా వెళ్లి ప్రదక్షిణ చేసి అమ్మవారికి జ్యోతులను సమర్పించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన అభిజ్ఞా నృత్యాలయం గురువు చంద్రభాను చతుర్వేది కేరళ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడంతో ఆమె చదువుకున్న బాలయేసు డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాళ్లు సారిరెడ్డి, జియావుల్లాఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. అరుదైన రికార్డును సొంతం చేసుకోవడం అభినందనీయమన్నారు.

గగన్‌మహల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


గగన్‌మహల్ వద్ద అజయ్‌జైన్, కలెక్టర్ తదితరులు

పెనుకొండ/లేపాక్షి: పెనుకొండలోని గగన్‌మహల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టర్ చేతన్‌తో కలిసి పట్టణంలోని గగన్‌మహల్ (రాజమహల్)ను సందర్శించారు. గగన్‌మహల్ నిర్మాణాన్ని చూసి అజయ్‌జైన్ మంత్రముగ్ధులయ్యారు. పురావస్తుశాఖ అధికారి స్వామి నాయక్ గగన్‌మహల్ ప్రత్యేకతలను వివరించారు. చరిత్రకారుడు మైనా స్వామి ఆలయాల వైభోగం పుస్తకాన్ని అజయ్‌జైన్‌కు అందించారు. లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని అజయ్‌జైన్ సందర్శించారు.

జగన్‌ను విమర్శించే స్థాయి హోంమంత్రికి లేదు

- వారానికోసారి వచ్చే ఎమ్మెల్యే మడకశిరను అభివృద్ధి చేస్తాననడం హాస్యాస్పదం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా వెనుకబడిన మడకశిర నియోజకవర్గంలో రూ.50 అభివృద్ధి కూడా జరగలేదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ధ్వజమెత్తారు. వారానికొకసారి మడకశిరకు వచ్చిపోయే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మడకశిర నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేస్తారని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి హోంమంత్రికి అనితకు లేదని స్పష్టం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి స్వగృహ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈరలక్కప్ప మాట్లాడారు. హోం మంత్రి అనిత పర్యటన వలన ఒరిగిందేమీ లేదన్నారు. జిల్లాలోని ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలిక అత్యాచారానికై గుర్తై బిడ్డను ప్రసవిస్తే కనీసం హోం మంత్రిగా పరామర్శించలేదన్నారు. ఇదేనా దళితరాలైన హోంమంత్రికి దళితులపై ఉన్న ప్రేమ అని ప్రశ్నించారు. మడకశిరలో 1,600 ఎకరాల్లో వైఎస్సార్ హయాంలో పారిశ్రామికవాడ ఏర్పాటైందన్నారు. వైఎస్ జగన్ హయాంలో భూములిచ్చిన రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇచ్చారని, ఈవిషయాన్ని ఎమ్మెల్యే గుర్తించాలని కోరారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విద్యుత్‌శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తాను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే రాజు బిల్డప్ ఇవ్వడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ఎమ్మెల్యే తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రితో పాటు ఐదారుగురు మంత్రులు వచ్చి పోయినా మడకశిర అభివృద్ధికి పైసా నిధులు రాలేదన్నారు. ఇంతకన్నా చేతకాని ఎమ్మెల్యే ఎవరైనా ఉన్నారంటే అది ఎంఎస్ రాజేనని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి, వివిధ విభాగాల అధ్యక్షులు శేషు, మల్లికార్జునగౌడ్, సికిందర్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, మాజీ జెడ్పీటీసీ శివన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తహసీల్దార్ కార్యాలయానికి ఫొటోల వితరణ

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి దేవాలయంలో వెలసిన వీరభద్రస్వామి, దుర్గాదేవి, ప్రసిద్ధి చెందిన నంది విగ్రహం ఫొటోలను అన్నదాన కమిటీ సభ్యులు తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం వితరణ చేశారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఇటీవల నూతన హంగులతో తీర్చిదిద్దిన నేపథ్యంలో కార్యాలయానికి ఫొటోలు అందజేశామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కృష్ణాష్టమి పోస్టర్ల విడుదల

సోమందేపల్లి: కృష్ణాష్టమి వేడుకలు ఆగస్టు 22న ఘనంగా నిర్వహించనున్నట్లు యాదవ సంఘం మండల అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి గోపాల్ తెలిపారు. మంగళవారం సోమందేపల్లిలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నరసింహమూర్తి, నరసింహ యాదవ్, శివశంకర, మైలారి, శ్రీనివాస్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బైండోవర్

సోమందేపల్లి: మండల కేంద్రంలో ఓ ఆటోడ్రైవర్ మరో ఆటో డ్రైవర్‌ను మత పరంగా దూషించడంపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఒకరిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఘటన విషయం తెలుసుకుని ఓ వర్గం వారు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది.

విలువలతో కూడిన విద్య అవసరం

హిందూపురం: పట్టణంలోని నింకంపల్లి రోడ్డులోని విద్యారణ్య అవాస ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్య అవసరంపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో బొంబాయి హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ పి.కల్లూరావు మాట్లాడుతూ విద్యతో పాటు క్రమశిక్షణ కల్గిన విలువలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కల్లూరావుకు పాఠశాల అధ్యాపకులు, నిర్వాహకులు సన్మానించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

లేపాక్షి: సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి వెల్లడించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ, మండలస్థాయి బాల్య వివాహాల నిరోధక కమిటీలు, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు, సచివాలయ కమిటీలకు బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, సీడీపీఓ సుధావరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వారాహిదేవికి ప్రత్యేక పూజలు


వారాహిదేవికి దీపార్చన చేస్తున్న మహిళలు

హిందూపురం: పట్టణంలోని లక్ష్మీసత్యనారాయణ స్వామి ఆలయంలో ఆషాఢమాసం చివరి మంగళవారాన్ని పురస్కరించుకుని శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన వారాహిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా మండలి సభ్యులతో లలితా సహస్ర నామస్తోత్రాలు, పారాయణాలు చేశారు.

పీ–4 కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

మడకశిర: అర్హులైన పేదలు పీ–4 కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ కోరారు. మంగళవారం పెనుకొండ రోడ్డు వార్డు సచివాలయం పరిధిలో పీ–4 కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన పేదలను పీ–4 జాబితాలోకి చేరుస్తామన్నారు.

హనుమాన్ దర్శన్ పేరిట ప్రత్యేక బస్సులు

పెనుకొండ: హనుమాన్ దర్శన్ పేరిట పెనుకొండ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎన్.రంగభాష్యం తెలిపారు. ఒకే రోజు మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వాములను దర్శించుకుని రావడం జరుగుతుందన్నారు. ప్రతి మంగళవారం, శనివారం ఈ ప్రత్యేక బస్సులను తిప్పుతున్నామన్నారు. పెద్దలకు రూ. 660, రూ. పిల్లలకు 330 టికెట్ ధర ఉంటుందన్నారు.

మురుగు నీటితో రోగాలు

పెనుకొండ: మురుగు నీటితో జ్వరాలు ప్రబలుతున్నాయని వజ్రాల పేటకు చెందిన అంజినరెడ్డి తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. పైభాగంలో ఉన్న భవనాల నుంచి మురుగు నీరు రోడ్లపైకి పారుతోందని, రోజూ ఈ నీటిని దాటుకుని ఇళ్లలోకి వెళ్లాల్సి వస్తోందన్నారు. దోమల ప్రభావం అధికమై జ్వరాలతో ఆస్పత్రి పాలవుతున్నామని వాపోయారు. నగర పంచాయితీ అధికారులు తగిన చర్యలు చేపట్టి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వీఎస్ఎస్ఎన్ భవన అభివృద్ధికి సహకారం

పావగడ: తాలూకాలోని కేటీ హళ్లిలో వీఎస్ఎస్ఎన్ (వ్యవసాయ సహకార సంఘం) భవన అభివృద్ధికి తప్పకుండా తమవంతు సహకారం అందిస్తామని చిత్రదుర్గం ఎంపీ కారజోళ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ కారజోళ మంగళవారం వీఎస్ఎస్ఎన్ భవనాన్ని సందర్శించారు.

మారెమ్మ ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో మారెమ్మదేవి

హిందూపురం: పట్టణంలోని ఆటోనగర్ భగీరథ సర్కిల్‌వద్ద మారెమ్మదేవి ఆలయ 27వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

జలధికి తరలిన పీర్లు


జమ్మానిపల్లిలో పీర్లను జలధికి తరలిస్తున్న భక్తులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లిలో బాబయ్య స్వామి పీర్లను మంగళవారం భక్తిశ్రద్ధలతో జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం బాబయ్య స్వాములను అగ్నిగుండం చుట్టూ ప్రదక్షణలు చేయించి పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి జలధి ఉత్సవం నిర్వహించారు.

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లిలో పీర్లను భక్తిశ్రద్ధలతో జలధికి తరలించారు. మూడు రోజులుగా స్థానిక పీర్ల చావిడిలో కుళ్లాయిస్వామి పీర్లను ఏర్పాటు చేసి పూజలు చేశారు. సాయంత్రం స్థానిక పెన్నానదిలోకి పీర్లను జలధికి తరలించారు.

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని మహదేవపల్లిలో మంగళవారం సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. గ్రామస్తులు ఐకమత్యంగా వేడుకలను నిర్వహించుకున్నారు.

మహాలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు


అలంకరణలో మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో అమ్మవారికి ఆషాఢ మాసం పూజలు మంగళవారంతో ముగిశాయి. ఆషాఢమాసం ప్రారంభం నుంచి ప్రతి మంగళ, శుక్రవారం రోజుల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రాజవంశీకుడు దొర రంగప్పరాజు, కైవాడస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి శ్రావణ మాసోత్సవాలు

పావగడ: స్థానిక శనీశ్వర స్వర్ణ దేవాలయంలో ఈ నెల 26 నుంచి శ్రావణ మాస వేడుకలు నిర్వహించనున్నారు. ఈసారి నూతనంగా రూపుదిద్దుకున్న శనీశ్వర స్వర్ణ దేవాలయాన్ని దర్శించి శనీశ్వరస్వామికి శ్రావణ పూజలు చేసేందుకు భక్తులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26న తొలి శ్రావణ శనివారం వేడుకలు జరగనున్నాయి.